క్లుప్తంగా

5న అయ్యప్ప జయంతి

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో ఏప్రిల్ 5న స్వామివారి జన్మన క్షత్రమైన ఉత్తరఫల్గుణి సందర్భంగా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి అభిషేకాలు, అర్చన, ప్రత్యేక అలంకరణలు ఉంటాయని, 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులంతా తరలిరావాలని కోరారు.

గడపగడపకు మన ప్రభుత్వం నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని బడివానిపేట పంచాయతీ గిమ్మివానిపేటలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ప్రత్యేక అలంకరణలో విజయగణపతి



విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రొడ్డులోని విజయగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం



కోష్ట కూడలిలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

రణస్థలం: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీఓ వాండ్రంగి ధనుంజయరావు అన్నారు. కోష్ట పంచాయతీలో ఫ్లైఓవర్ క్రింద గ్రామస్తులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు అధికంగా ఉండే చోట స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కోష్ట సర్పంచ్ పిషిణి చిన్నంనాయుడు, పంచాయతీ కార్యదర్శి అలీబేగ్, వైఎస్సార్ సీపీ నాయకులు పిషిణి లక్ష్మణరావు, పల్లె సత్యం, కరిమజ్జి రమణ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవానికి పందిరిరాట



పందిరిరాట వేస్తున్న మహిళలు

జి.సిగడాం: మండలంలోని దవళపేటలో ఈ నెల 30న జరగనున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవానికి మంగళవారం రామాలయం వద్ద పందిరి రాట వేశారు. గ్రామ మహిళలంతా పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు

లావేరు: చినమురపాక ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సపోర్టివ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు సందర్శించారు. కార్యక్రమ ఉద్దేశాన్ని ఉపాధ్యాయులకు వివరించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం బి.అసిరినాయుడు, సీఆర్‌పీ పి.మహేశ్వరం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

శ్రీకాకుళం న్యూకాలనీ: బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. బూత్ స్వశక్తి కిరణ అభియాన్‌లో భాగంగా మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవి బాబ్జీ, చల్లా వేంకటేశ్వరరావు, సీడీఆర్ గాంధీ, పాలవలస వైకుంఠరావు, మంగి లక్ష్మీరెడ్డి, ఎన్.లక్ష్మీనారాయణ, గుజ్జల రాజు, వెంకట్ పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి

- ప్రతిపక్షాలకు వేస్తే సంక్షేమ పథకాలు కొనసాగవు
- తర్వాత బాధపడినా ప్రయోజనం ఉండదు
- మాటకు కట్టుబడి వైఎస్సార్ ఆసరా చెల్లింపు
- మహిళా సంఘాలకు చెక్కు పంపిణీలో మంత్రి ధర్మాన



శ్రీకాకుళం రూరల్: కిల్లిపాలెంలో ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలే మహారాణుల రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెం పంచాయతీ పరిధిలో వైఎస్సార్ సీపీ నాయకులు తంగి ఈశ్వర్, తంగి శ్రీపతి, తంగి రవి అధ్యక్షతన మంగళవారం మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీకాకుళం మండల పరిధిలోని 9 పంచాయతీల్లో 528 సంఘాల్లోని 5,494 మంది సభ్యులకు రూ.3,76,17,774 అందించినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాలు కలిగి ఉన్న రుణాలను నాలుగు విడతలుగా తీర్చేందుకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి ఇప్పటికి మూడు విడతల్లో అందించారన్నారు. ఇంటి బాధ్యత చూసుకునే ఇల్లాలి పేరిట హక్కులు, పథకాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రభుత్వం వారి పేరిట అకౌంట్లలో డబ్బులు జమ చేయడం, సంక్షేమ పథకాలు అందివ్వడం చేస్తోందన్నారు. మహిళలు మద్దతుతోనే పెద్ద ఎత్తున జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనం సృష్టించారని, 2024 అది రెట్టింపయ్యేలా మహిళలంతా పెద్ద ఎత్తున పూనుకోవాలన్నారు. డబ్బు దుబారా చేస్తున్నారని, పనికిరాని పథకాలు ప్రవేశపెడుతూ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశారని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు విషప్రచారం చేయడం తగదన్నారు. రేపు పొరపాటున విపక్ష పార్టీకి ఓటేస్తే జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నీ ఆపేస్తారని, అప్పుడు ఓటు వేసి తప్పుచేశామనే ఆలోచనలో ఏ మహిళా పడకూడదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందుకున్న మహిళంతా కార్యక్రమానికి హాజరు కావడం పండగ వాతావరణంలా ఉందన్నారు. మాజీ మంత్రి త్రిపురాన వెంకటరత్నం మాట్లాడుతూ చంద్రబాబు గుంటనక్క లాంటి వాడని, పొరపాటున నమ్మి ఓటు వేస్తే మన భవిష్యత్ అంధకారంలోకి వెళ్లిపోతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధ్యక్షురాలు చింతాడ మంజు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎచ్చెర్ల సూరిబాబు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, ఎంపీపీ అంబటి నిర్మల, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, చల్లా రవికుమార్, గంగు నరేంద్రకుమార్, లోలుగు శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు మూల కృష్ణవేణి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఎంపీడీఓ రఘు, ఏపీఎం సుజాత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యుత్ ఫిర్యాదులపై స్పందించండి



పైడిభీమవరంలో సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఈ దైవప్రసాద్

రణస్థలం: విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ అన్నారు. పైడిభీమవరంలో కొత్తగా ఏర్పాటు చేసిన సెక్షన్ విద్యుత్ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడిభీమవరం, పాతర్లపల్లి, కోష్ట సబ్ స్టేషన్లు పైడిభీమవరం సెక్షన్ ఆఫీస్ పరిధిలోకి వస్తాయని చెప్పారు. ఇకపై విద్యుత్ సమస్యల పరిష్కారం, కొత్త అభివృద్ధి పనుల నిమిత్తం పైడిభీమవరంలో అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస సాహు అందుబాటులో ఉంటారని తెలిపారు. గ్రామాల్లో వినియోగదారుల నుంచి ఏఈ, ఏడీ, ఎస్ఈల స్థాయికి ఫిర్యాదులు వస్తున్నాయంటే పంచాయతీల పరిధిలో పనితీరు బాగా లేనట్లు భావించాల్సి వస్తుందన్నారు. వినియోగదారుల నుంచి ఏ సమయంలో ఫోన్ వచ్చినా వెంటనే స్పందించి ఎంతసేపట్లో పరిష్కారం చేయగలమో సమాధానం చెప్పాలన్నారు. ఫోన్ లిఫ్ట్ చేయకపోతే మనపై నమ్మకం పోతుందని, అప్పుడు పైస్థాయి అధికారుల వరకు ఫిర్యాదులు వస్తాయని సిబ్బందికి వివరించారు. సముద్ర తీర ప్రాంతంలో విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా యర్రవరం సబ్‌స్టేషన్ పరిధిలో తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. లావేరు మండలం వెంకటాపురంలో కొత్తగా సబ్ స్టేషన్ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. శ్రీకాకుళం పరిధిలో 190 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటినంత త్వరగా కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీ యు.వి.రమణమూర్తి, ఈఈ ఎస్.బయ్యన్ననాయుడు, రణస్థలం, పైడిభీమవరం ఏఈలు ఎం.శ్రీనివాసరావు, జి.శ్రీనివాససాహు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపవద్దు



అవగాహన కల్పిస్తున్న టూటౌన్ ఎస్ఐ వెంకటేషు

శ్రీకాకుళం క్రైమ్ : మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.వెంకటేషు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి కుటుంబానికి తీరని శోకం మిగుల్చుతున్నారని చెప్పారు. హెల్మెట్ ధారణపై ప్రతిఒక్కరూ దృష్టిపెట్టాలని హితవుపలికారు.

ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జి.సిగడాం: రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, డీటీ నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

లావేరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు లావేరులో మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.చక్రధరరావు, బి.ఉత్తర, ఎం.గౌరీశంకర్, ఎల్.లక్ష్మీ, కె.సూర్యకుమారి, కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పథకం.. అదే జగనన్న ధ్యేయం

- సంక్షేమ పాలనతో కోట్లాది కుటుంబాల్లో వెలుగులు
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిరణ్



మధుపాంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: పేదలు, బలహీన వర్గాలను గుర్తించి అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం నిద్దాం సచివాలయం పరిధిలోని మధుపాం, నల్లిపేట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పథకాలను అమలు చేస్తున్నారని, అర్హతలు ఉండి ఇంకా పథకాలు అందకపోతే సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, వైఎస్సార్ సీపీ మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, జేసీఎ కన్వీనర్ డోల వెంకటరమణ, నాయకులు బూరాడ వెంకటరమణ, డాక్టర్ మీసాల రాంబాబు, ముగ్గ శ్రీనివాసరావు, నల్లి తవిటినాయుడు, నల్లి లక్ష్మి, సర్పంచులు బత్తుల వెంకటకృష్ణారావు, చిత్తిరి మోహన్, తొత్తడి రామారావు, నల్లి ఆదినారాయణ, బాలి అప్పలసూరి, బోనేల పట్టాభి, పూజారి రామ్మోహన్, ఏటయర్రా శారద, ఏఈఈలు కె.తిరుపతిరావు, పోలినాయుడు, భాగ్యలక్ష్మి, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

జగన్‌బాబు మేలు మరువలేను..



జగన్‌బాబు అధికారంలోకి రాగానే మాలాంటి వృద్ధులను ఆదుకున్నారు. పింఛన్ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతోంది. జన్మజన్మలకు జగన్‌బాబే నా పెద్ద కుమారుడు. ఈ ప్రభుత్వ హయాంలో నాకు రూ.5 లక్షల 36 వేలు లబ్ధి చేకూరింది.

– అలుగోలు కాంతమ్మ, మధుపాం

ఆదుకున్నారు.



మేం పేదలం. పక్కా ఇల్లు లేక పోవడంతో ఇబ్బందులు పడ్డాం. జగనన్న అధికారంలోకి రావడంతో మా పిల్లలకు అమ్మ ఒడి, మాకు పక్కా ఇల్లు ఇచ్చారు. జగనన్న మాకు పెద్దన్న. ఈ ప్రభుత్వ పాలనలో రూ.4 లక్షల 92 వేలు లబ్ధి చేకూరింది.

– ఎల్.రత్నకుమారి, మధుపాం

సేవలను సద్వినియోగం చేసుకోండి



బెజ్జిపురంలో మంచినీటి కుళాయి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

లావేరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బెజ్జిపురంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని, బెజ్జిపురం పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన మినీ వాటర్‌ట్యాంకులను, మంచినీటి కుళాయిలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనువాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, నాయకులు దన్నాన అప్పలనాయుడు, పిన్నింటి పూర్ణచంద్రరరావు, ఇజ్జాడ వెంకటరమణ, చివికి అసిరప్పడు, ఇజ్జాడ సూర్యనారాయణ, కడుపూరి అప్పారావు, దన్నాన రామ్మూర్తి, ఇజ్జాడ సన్యాసప్పుడు, కలిశెట్టి పైడితల్లి, లంకలపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలికాంలో వైద్య శిబిరం

శ్రీకాకుళం రూరల్: నైరా వ్యవసాయ కళాశాల విద్యానేకథలు నిర్వహిస్తున్న జాతీయసేవా పథకంలో భాగంగా అలికాం గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది రక్త పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్, జెమ్స్ ఆస్పత్రి మేనేజర్ శివప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి జి.ఎస్. రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసూక్ష్మాలకు నెలవు రామాయణం



ప్రసంగిస్తున్న నర్సింహమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: రామాయణంలో నేటి పరిస్థితులకు అనుగుణమైన ఎన్నో ధర్మసూక్ష్మాలు ఉన్నాయని నిష్టల నర్సింహమూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో జరుగుతున్న రామ వసంతోత్సవాల సందర్భంగా మంగళవారం ప్రవచనాలు చెప్పారు. కార్యక్రమంలో విజయకుమార్, విశ్వేశ్వరరావు, అప్పన్న, చాగంటి బాపయ్యపంతులు, కె.కృష్ణమూర్తి, లక్ష్మీ, నిర్మల, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేదిక సిద్ధం



కల్యాణోత్సవానికి సిద్ధమైన వేదిక

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని సంజీవని సహిత అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 30న శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సీతారాముల కల్యాణం కోసం వేదిక సిద్ధమైంది. సింహాచలం నుంచి వచ్చిన నిర్మాణ కర్తలు ఈ వేదికను అతిసుందరంగా తీర్చిదిద్దారు. అదేరోజుసాయంత్రం 7 గంటలకు జానపద గీత నృత్య ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో నీటి సౌకర్యానికి చర్యలు



బోరు పనులు పర్యవేక్షిస్తున్న డైరెక్టర్ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) రన్నింగ్ నీటి సౌకర్యంపై అధికారులు తక్షణ చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా మంగళవారం రెండు బోర్ల నిర్మాణం చేపట్టారు. విద్యార్థుల ఫిర్యాదుల నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.8 లక్షలు కేటాయించింది. బోరు పనులను క్యాంపస్ డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు పర్యవేక్షించారు. ప్రస్తుతం ఉన్న బోర్లతో నీటి వనరులు తగ్గటం, కలుషితం కావటం వంటి సమస్యల వల్ల రన్నింగ్ నీటి సరఫరా పూర్తిస్థాయిలో సాధ్యం కావటం లేదని, తాజాగా బోర్లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



లావేరు: గోవిందపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా వేడుకలు

గార: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్నకుమారి అన్నారు. మంగళవారం గారలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జయలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- లావేరు: గోవిందపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషా, సచివాలయం ఎంఎస్‌కే యమునారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించి వాటి ఆవశ్యకతను తెలియజేశారు.
- రణస్థలం: కోష్ట సెరాకటర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో రణస్థలం ఐసీడీఎస్ పీఓ ఝాన్సీ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.
- జి.సిగడాం: డి.ఆర్.వలస సెక్టార్ పరిధిలోని సర్వేశ్వరపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజిని, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

- గోడ కట్టిన ఆక్రమణదారు
- నోటీసులు అందజేసిన అధికారులు



సింగుపురం ప్రధాన రోడ్డులో మార్కెట్ నిర్వహిస్తున్న స్థలం ఇదే

శ్రీకాకుళం రూరల్: తరతరాలుగా గ్రామ చావిడీ, బందీలదొడ్డి, మార్కెట్ కొనసాగుతున్న ఆ ప్రభుత్వ భూమిపై ఆక్రమణదారు కన్నుపడింది. రెవెన్యూ రికార్డులను మార్పు చేస్తూ ఆ స్థలం తమదంటూ ఏకంగా గోడ కట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న అధికారులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకుని సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం మేజర్ పంచాయతీలో ప్రధాన రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 712లో 2లో ఆరు సెంట్ల స్థలం ఉంది. ఒకప్పుడు రెవిన్యూ ఆధీనంలో ఉన్న ఇదే స్థలంలో గ్రామచావిడి సభలు, సదూర ప్రాంతాల వారికి నుంచి వచ్చేవారికి రాత్రిబసలు, గ్రామ అవసరాల కోసం ఈ స్థలానే వాడుకునేవారు. అంతేకాకుండా పశువులు, పందుల జరిమానా వసూళ్లకు సంబంధించిన బందీలదొడ్డిగానూ పూర్వం ఇక్కడే నిర్వహించేవారు.



గోడ కట్టిన దృశ్యం

మార్కెట్ నిర్వహణ..

ఈ స్థలంలో కొంతభాగం సింగుపురం గ్రామస్తుల సౌకర్యార్థం బస్టాండ్ ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన స్థలంలో చుట్టుపక్కల రైతులు తాము పండించిన పంటలను ఉదయం, సాయంత్రం వేళ ఇక్కడే విక్రయించుకుంటున్నారు. 40 సంవత్సరాలుగా ఈ మార్కెట్ కొనసాగుతోంది. ఇప్పుడు ఈ స్థలం తమ ఆధీనంలో ఉందంటూ, మార్కెట్ నిర్వహణ కొనసాగించవద్దంటూ చుట్టూ ప్రహరీ కట్టేందుకు ఓ వ్యక్తి పూనుకున్నాడు. విషయం తెలుసుకున్న మండల పరిషత్ కార్యాలయ అధికారులు ఈ ప్రక్రియను అడ్డుకున్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ వారం రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు.

స్వాధీనం చేసుకుంటాం

ప్రస్తుతం ఆ స్థలం వివాదంలో ఉన్న విషయం వాస్తవమే. రెవెన్యూ రికార్డుల పరంగా పరిశీలించి నోటీసులు అందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటాం. మండల పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవు.

వెంకటరావు, శ్రీకాకుళం రూరల్ తహశీల్దార్

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

జి.సిగడాం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల సిల్వర్‌జోన్ సంస్థ నిర్వహించిన ఒలింపియాడ్ పోటీల్లో సత్తాచాటారు. మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొనగా రెండు బంగారు, రెండు రజత, రెండు కాంస్య పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక తెలిపారు. వీరిని మంగళవారం అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు